

హైదరాబాద్ వార్త

## డిమాండ్ పెరిగినా.. ‖ సమ్మర్‌కు ఏర్పాట్లు ‖

# ఇబ్బందులు రాకుండా చర్యలు

**అదనంగా మరో 1500 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు**

**లోడ్ ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో డిటిఆర్‌ల కెపాసిటీ పెంపు**

**ఈఏడాది 85-90ఎంయూలకు చేరే అవకాశం ఉన్నట్లు అంచనా**




హైదరాబాద్, ఫిబ్రవరి 13 ,ప్రభాతవార్త: ఇటీవల ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ తగిన ఏర్పాట్లు చేస్తుంది. వేసవి ప్రారంభానికి ముందే గ్రేటర్ జోన్‌పరిధిలోని విద్యుత్ తీగలు తనిఖీ చేయడంతోపాటు అవసరమైన చోట కొత్తవిద్యుత్ లైన్లు వేస్తుంది. గతేడాది మార్చి మొదటివారం నుంచే విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. దీంతో విద్యుత్ డిమాండ్ ఎంతపెరిగినా అంతరాయాలు తలెత్తకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అందించేలా డిస్కం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో టిఎస్ఎస్‌పి డిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారుఖీ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు విద్యుత్‌తీగలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ల నిర్వాహణపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. లోడ్ ఎక్కువవగా ఉన్న ప్రాంతాల్లో కొత్తడిటిఆర్‌లు ఏర్పాటు చేసి కెపాసిటీ పెంచడంతోపాటు దాదాపు 1500 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అలాగే చెట్లకొమ్మలు వంటివి తొలగించి లైన్లకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. గ్రేటర్ పరిధిలోని 9సర్కిళ్లలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ఫీడర్లను విభజిస్తూ కొత్త ఫీడర్లును అందుబాటులో తెచ్చి వాటి కెపాసిటీని పెంచారు. అవసరమైన చోట 33కెవి, 11కెవి, యుజి కేబుల్, ఏబి కేబుల్‌లను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలో ఫీడర్లను విభజిస్తూ, గాంధీనగర్, ఓయూకాలనీ, దస్తానగర్, గోల్కొండ క్రాస్‌రోడ్‌తోపాటు అజామాబాద్ ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో కొత్త ఫీదర్లు అందుబాటులోకి తెచ్చారు. సైఫాబాద్, అజామాబాద్, మెహిదీపట్నం డివిజన్లలో సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. బంజారాహిల్స్ సర్కిల్‌లో 80వరకు కొత్త డిటిఆర్‌లు ఏర్పాటు చేయడంతోపాటు కుమ్మరిబస్తీ, ఎంసిహెచ్ మార్కెట్, బికే గూడ, కార్మికనగర్, ఇమేజ్‌గార్డెన్ ప్రాంతాల్లో కొత్త ఫీడర్లు అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో 10వరకు కొత్తఫీడర్లు 64డిస్ట్రిబ్యూషన్ పార్మర్లు, రవీంద్రనగర్, పార్కులేన్, జేమ్స్‌స్ట్రీట్, రాంరాజ్ నగర్, ఎండీఈఎఫ్ కొత్తఫీడర్లు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అలాగే రాజేంద్ర నగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి, ఐసిఆర్, స్నేహితహిల్స్, గంధం గూడతోపాటు 19ప్రాంతాల్లో ఫీడర్ల విభజన చేపట్టారు. సరూర్‌నగర్, సైబర్‌సిటీ, మేడ్చల్ సర్కిళ్ల పరిధిలో 50కిపైగా ఫీడర్లను విభజిస్తూ కొత్తఫీడర్లు ఏర్పాటు చేశారు.

**85-90 ఎంయూలకు చేరే అవకాశం**

మండుతున్న ఎండలతో గ్రేటర్ లో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరగుతుంది. ఫిబ్రవరి మొదటివారం నుంచే రికార్డు స్థాయిలో ఎండలు తీవ్రత ఉండటంతో అదేస్థాయిలో కరెంట్ వినియోగం పెరుగుతుంది. ఈనెల 12న 65 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందని అధికారులు తెలిపారు. పరిస్థితి ఇలానే ఉంటే ఫిబ్రవరి చివరవరకు 70మిలియన్ యూనిట్లు దాటే అవకాశముందని అభిప్రాయపడు తున్నారు. గతేడాది ఏప్రిల్ -మేనెలల్లో అత్యధికంగా 80మిలియన్ యూనిటన్ల విద్యుత్ నమోదైతే ఈసారి మాత్రం మార్చి,ఏప్రిల్ నెలల్లోనే దాన్ని అధిగమించే అవకాశం ఉందని పేర్కొన్నారు.దీంతో ఏప్రిల్ చివరినాటికి 85-90 యూనిట్ల చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా గ్రేటర్‌లోని 9సర్కిళ్లలో 62లక్షల విద్యుత్‌కనెక్షన్లు ఉండగా అందులో 5లక్షలకుపైగా గృహవినియోగదారులు ఉన్నారు. ముఖ్యంగా విద్యుత్ వినియోగగం గణనీయంగా పెరగడానికి నగర శివారు ప్రాంతల్లో కొత్త ఇండ్ల నిర్మాణంతోపాటు భారీ హౌసింగ్ ప్రాజెక్టులు, పంరిశ్రమల ,వ్యాపార కార్యకలాపాలు పెరుగుతుండటంతో ప్రతిఏడాది గతేడాదికంటే 20శాతం అధికంగా డిమాండ్ పెరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు.

## బిఆర్ఎస్‌ను కాంగ్రెస్ కలవరపెడుతోందా..?

**సిఎంని డిప్యూటీ మేయర్ కలవడంపై బిఆర్ఎస్ వర్గాల్లో ఆందోళన**



సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి దంపతులు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : గ్రేటర్‌లో బిఆర్ఎస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, మోతె శోభన్‌రెడ్డి దంపతులు మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డిని కలవడం హాట్‌టాపిక్‌గా మారింది. వారి వెంట మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ ఉన్నారు. దీంతో వారు కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమైందని తెలుస్తోంది. కాగా డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి మూడు రోజుల క్రితం జరిగిన కార్పొరేటర్ల సమావేశానికి హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో త్వరలో భారీ ఎత్తున కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నారని సమాచారం. డిప్యూటీ మేయర్ భర్త శోభన్‌రెడ్డి తెలంగాణ గ్రేడర్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. టిఆర్ఎస్ ఆవిర్బావంలో మాజీ సిఎం కెసిఆర్ వెంట నడిచారు. విద్యార్థి, యువజ విభాగాల్లోనే కాకుండా పార్టీ కార్యవర్గంలో కీలకంగా వ్యవహరించారు. అయినా ఆయన ఆశించిన పదవులు పొందలేకపోయారు.

లోక్‌సభ ఎన్నికల నాటికి గ్రేటర్‌లో పార్టీ బలోపేతం లక్ష్యంగా కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర తీస్తోంది. ఈ క్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లను చేర్చుకోవడంపై దృష్టి సారించింది.రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన కాంగ్రెస్ పార్టీకి జిహెచ్ఎంసి పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకటి కూడా దక్కని విషయం తెలిసిందే. ఇప్పటికే 14-18 మంది బిఆర్ఎస్ కార్పొరేటర్లతో పార్టీ నేతలు సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యే సిఎం రేవంత్‌రెడ్డిను కలిసినట్లు చెబుతున్నారు. ఇప్పటికే జిహెచ్ఎంసి మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మేయర్ గద్వాల విజయలక్ష్మీ కూడా ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డిను కలిశారు. పాలనా పరమైన అంశాల కోసమేనని ఆమె చెప్పినప్పటికీ తాజా పరిణామాల నేపథ్యంలో మేయర్ అడుగులు ఎటువైపు అన్న చర్చ నగరంలో జరుగుతోంది.

### ఓయూలో చైన్ స్నాచింగ్ కలకలం

తార్నాక, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీలోని ఆక్సిజన్ పార్కులో మంగళవారం సాయంత్రం చైన్ స్నాచింగ్ చోటు చేసుకుంది. డిడి కాలనీకి చెందిదిన మహిళ ఆక్సిజన్ పార్కులో వాకింగ్ చేస్తుండగా బైక్‌పై వచ్చిన దుండగుడు ఆమె మెడలోని ఏడుతులాల గొలుసును లాక్కొని పరారయ్యాడు. దీంతో క్యాంపస్ విద్యార్థులు ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురయ్యారు.

## నిజాం వారసుడికి బెదిరింపులు

**ఫిలింనగర్ పిఎస్‌లో కేసు నమోదు**

హైదరాబాద్, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త: నిజాం మనవడికి సంబంధించిన ఆస్తులను కాజేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులు తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆయన కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో ఓవ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..మణికొండ సమీపంలోని డైమండ్ హిల్స్‌లోని ఫిర్‌దౌస్ విల్లాలో నివాసం ఉంటున్న దిల్షాద్ ఝూ అనే వ్యక్తి హైదరాబాద్ ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు మనువడు. వారి వంశానికి చెందిన ప్రిన్స్ షామత్ అలీఖాన్ గతేడాది జూలైలో మరణించాడు. ప్రిన్స్ షామత్ అలీఖాన్ ఇంట్లో సుమారు 15ఏళ్లపాటు పనిచేసిన సయ్యద్ ఎజాజ్ ఖాద్రీ ఆయన ఆస్తులు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రిన్స్ షామత్ అలీఖాన్ చనిపోకముందు కొన్ని పత్రాలపై సంతకాలు చేయించుకని ఆస్తులు తనవే అని వాదిస్తుండటంతో పాటు తమ మీద తప్పుడు కేసులు పెట్టాడని దిల్షాద్ ఝూ ఫిలింనగర్ పోలీసులు ఫిర్యాదు చేశారు. వారం రోజుల క్రితం రోడ్డుమీద వెళ్తున్న తమను సయ్యద్ ఎజాజ్ ఖాద్రీ అడ్డగించడంతో పాటు ఆస్తులకు సంబంధించి సెటిల్ చేసుకోవాలని, దీనికోసం రూ.కోటి ఇస్తామనని లేకుంటే అడ్డుతొలగించుకోవాల్సి ఉంటుందని బెదిరించాడంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

## విద్యుత్ మీటర్ తొలగిస్తామని.. వినియోగదారుడికి నోటీసులు



మూసాపేట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ఇంటికి మీటర్ మంజూరు చేసిన విద్యుత్ అధికారులు కొన్నాళ్ళకు మీటర్ తొలగిస్తామని నోటీసులు ఇవ్వడంతో వినియోగదారుడు అవాక్కయ్యాడు. కూకట్‌పల్లి మండలం ఖైత్లాపూర్ సర్వేనెంబర్ 1007లో చంద్రశేఖర్‌రెడ్డి అన్ని డాక్యుమెంట్లు జతపరిచి మీటర్‌కు దరఖాస్తు చేయడంతో మంజూరు చేసి ఆయన నిర్మించిన గదికి మీటర్‌ని బిగించారు. అయితే కొంత కాలం తర్వాత ఈ స్థలం వివాదంలో ఉందని పేర్కొంటూ మీటర్ తొలగిస్తామని అధికారులు నోటీసులు అందచేయడం పట్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గదికి బిగించిన మీటర్‌ని తొలగిస్తామని ఇచ్చిన నోటీసుల్ని అధికారులు వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. విద్యుత్ అధికారుల పై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు. అయితే ఈవిషయమై డీఇని వివరణ కోరగా ఈ స్థలం తనదేని ఓ వ్యక్తి తమకు ఫిర్యాదు చేయడంతో చంద్రశేఖరెడ్డితోపాటు ఈ స్థలం తనదేనం టున్న వ్యక్తిని డాక్యుమెంట్లను తమ అందచేయాలని కోరినట్లు తెలిపారు. వీరిద్దరి డాక్యుమెంట్లను విద్యుత్ శాఖ లీగల్ సెల్‌కి పంపించనున్నట్లు డీఇ తెలిపారు.

## నగరంలో పలు ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న సింగూరు ప్రాజెక్టులో భాగంగా పెద్దాపూర్ పంప్‌హౌజ్ దగ్గరున్న 132 కెవి సబ్ స్టేషన్‌లో టిఎస్‌పి డిసిఎల్ నిర్వహణ పనులు చేపట్టింది. ఈ నిర్వహణ పనులు నాలుగు గంటల పాటు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 16 తేది శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కొన్ని ప్రాంతాలలో పాక్షికంగా, మరికొన్ని ప్రాంతాలతో పూర్తిగా నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని జలమండలి అధికారులు వెల్లడించారు.

## ఆర్థిక ఇబ్బందులతో.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం



మృతి చెందిన భువన్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త : ఆర్థిక ఇబ్బందులతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో చోట చేసుకుంది. ఈస్ట్ గోదావరి జిల్లా మండపేట మండలం కేశవపురం గ్రామానికి చెందిన భువన్ (24) గచ్చిబౌలిలోని టిసిఎస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కెపిహెచ్‌బి కాలనీలోని హాస్టల్‌లో నివాసముంటున్న భువన్ తండ్రి కొంతకాలం క్రితం చనిపోగా తల్లి ఇంటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరింది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎక్కువవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన భువన్ హాస్టల్ రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసును కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### టెన్నిస్ టోర్నమెంట్స్‌లో ఫైనల్‌కు చేరిన విశ్వక్ రెడ్డి



కంటోన్మెంట్,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన విశ్వక్ రెడ్డి ఆల్ ఇండియా టెన్నిస్ పోటీల్లో ఫైనల్‌కు చేరుకున్నాడు. అజీజ్ నగర్‌లో కొనసాగుతున్న టెన్నిస్ టోర్నమెంట్స్, శ్రీపతి వెంకట్ రావ్, లేక్ వ్యూ టెన్నిస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 3 రోజుల పాటు కొనసాగుతున్నాయి. ఈ క్రీడలను ప్రముఖ వ్యాపార వేత్త దయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనే విధంగా పట్టుదలతో క్రీడల్లో పాల్గొనాలని ప్రముఖ వ్యాపారవేత్త దయానంద్ అన్నారు.

### ఆటో డ్రైవర్ అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : ఆటో డ్రైవర్ అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.. సులేమాన్ నగర్‌కు చెందిన మహ్మద్ మహబూబ్ పాషా (29) వృత్తి రీత్యా ఆటో డ్రైవర్ గత నెల 22వ తేదీన ఇంటి నుంచి బయలు దేరి వెళ్లిన మహబూబ్ పాషా తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోయింది.

## కరాటే విద్య నిత్య సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం : నటుడు సుమన్




విశాఖపట్నంలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న హీరో సుమన్

నార్సింగి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : కరాటే విద్య నిత్య సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ప్రముఖ హీరో సుమన్ పేర్కొన్నారు. విషాఖపట్నంలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో గండిపేట మండలం కోకాపేట్ గ్రామానికి చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబరిచారు. మాస్టర్ రాజు నేతృత్వంలో పోటీల్లో పాల్గొన్న లౌషిక్ పసిడి, తనూష్ రజత పతకాలు సాధించి సత్తా చాటారు. వీరిని సుమన్ అభినందించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ కరాటే విద్యను సాధన చేసే విద్యార్థులలో చురుకుదనం పెరుగుతుందన్నారు. వీరు చదువుల్లో సైతం రాణిస్తారన్నారు.

### సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ నేతలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గం, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ సీనియర్ నేత గుర్రం శంకర్ మంగళవారం పూర్వ ఎమ్మెల్సీ రాములు నాయక్‌తో కలిసి అసెంబ్లీలోని సిఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పార్టీలో ఉంటూ అంకితభావంతో పనిచేస్తున్నానని, త్వరలో భర్తిచేయబోయే నామినేటెడ్ పదవుల కేటాయింపులో తనకు అకవాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

**మనవల్ల ఇతరులు ఇబ్బందులు పడకూడదు**

**ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి**

**పబ్లిక్ ఆడియో క్లిప్పింగ్ విడుదల: సిపి శ్రీనివాస్‌రెడ్డి**



ఆటోడ్రైవర్లకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం, చిత్రంలో నగర సిపి

మెహిదీపట్నం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త : ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షితమై ప్రాయాణం చేయగలుగుతామని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వాహనాలు నడిపే సమయంలో మనవల్ల ఇతరులు అసౌకర్యానికి గురికాకూడదని తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత నెలలో (2024)భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై ఆటో, ట్రక్ డ్రైవర్లకు అవగాహణ కార్యక్రమాన్ని మంగళవారం గుడిమల్కాపూర్‌లోని ఓఫంక్షన్‌హాల్‌లలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి, సినీ హీరో జొన్నలగడ్డ సిద్దు, ట్రాఫిక్ అడిషనల్ సీపీ పి.విశ్వప్రసాద్‌లు హాజరై మాట్లాడారు. నగరంలో నిత్యం లక్షల మంది వాహనాలను నడుపుతూ ప్రయానాలు కొనసాగిస్తారని తెలిపారు. ఆర్టీసి బస్సు సౌకర్యం లేని చోట ఎక్కువగా ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తారని, వారి పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆటో రవాణా వ్యవస్థ లేకుండా నగర ప్రజల జీవనాన్ని ఊహించుకోలేమన్నారు. **మిగతా సిటీ 3వ పేజీలో**

## ప్రజావాణిలో వచ్చిన సమస్యల్ని పరిష్కరించాలి

**జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్**



జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కి ఫిర్యాదులు అందచేస్తున్న దృశ్యం

కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ప్రజా వాణి కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ప్రజా వాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, ట్రేడ్స్, రెవిన్యూ విబాగాల అధికారులు తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులను గుర్తించి, ఏయే ప్రాంతాల్లో సమస్యలు నెలకొన్నాయో తెలుసుకోవాలన్నారు. ప్రజా వాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలు లబ్ధిపొందాలని జెడ్సీ కోరారు. ప్రజా వాణి కార్యక్రమంలో 29 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో 10, మూసాపేట సర్కిల్ నుంచి 2, కూకట్‌పల్లి నుంచి 1, కుత్బుల్లాపూర్9, గాజుల రామారం, 7, ఫిర్యాదుల్ని ప్రజలు అందచేసినట్లు తెలిపారు. జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్ళలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలన్నారు. పన్నుల్ని సక్రమంగా వసూలు చేసి గ్రేటర్ ఆదాయ పెంపుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనేక ప్రాంతాల్లో గుంతలమయంగా మారిన రోడ్ల మరమ్మతుకు ఇఈలు, డీఇలతోపాటు ఇఎలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రతకు గాను పారిశుద్య పనుల నిర్వహణను అధికారులు సక్రమంగా నిర్వహించి స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గతంలో పలు మార్లు నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏవిధమైన చర్యలు తీసుకున్నారని జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్ అధికారులను ప్రశ్నించారు. ప్రజా సమస్య ల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా సకాలం లో పరిష్కరించాలని కమిషనర్ అభిలాష్ అభినవ్ కోరారు.

## కులగణన, బిసి డిమాండ్లపై సిఎం నిర్ణయం హర్షణీయం

**బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ**

హైదరాబాద్, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త: కులగణన చేయాలని, బిసి గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, స్కాలర్‌షిప్ పెంచాలని, ప్రతిపార్లమెంట్ నియోజవకవర్గానికి బిసి స్టడీ సర్కిల్ మంజూరు చేయాలని, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలని బకాయిలు లేకుండా గ్రీన్‌ఛానల్‌లో పెట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాల పట్ల జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జకృష్ణ ,వివిధ బిసిసంఘాలు హర్ష వ్యక్తం చేశాయి. ఈమేరకు మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో గుజ్జకృష్ణ మాట్లాడుతూ జనగణనలో కులగణన చేయాలని ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డి తీసుకన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అలాగే దేశవ్యాప్తంగా కులగణన చేయడానికి కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ప్రతిపక్ష పార్టీలు అన్నీ వచ్చే పార్లమెంట్ సమావేశంలో ఐక్యమత్యంగా పోరాడాలన్నారు. కులగణనతో ఒక్కో కులం జనాభాతోపాటు సాంఘీక, ఆర్థిక వివరాలు లభించడంతోపాటు కులాలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు లభిస్తాయన్నారు. దీంతో బిసికులాల ఆర్థిక అభివృద్ధికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. బిసికులాల మధ్య ఉన్నవ్యత్యాసాలను తొలగించడానికి గ్రూపులుగా వర్గీకరించడానికి కులాల వారి జనాభా లెక్కలు ఉపయోగపడుతుందని గుజ్జకృష్ణ పేర్కొన్నారు.




**కనువిందుగా జాతీయ సంగీత నృత్యోత్సవాలు**

వివరాలుబ సిటీ 3వ పేజీలో



# పెండింగు పనులను వెంటనే పూర్తి చేయాలి

## నిజాంపేట మేయర్ నీలారెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త: నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో మంగళ వారం మేయర్ కోలన్ నీలాగోపాల్ రెడ్డి అధ్యక్షతన కమీషనర్ రామకృష్ణరావు, ఎస్.ఈ.సత్యనారాయణతో కలిసి ఎన్ఎంసి విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పలు నిర్మాణ అభివృద్ధి పనులు, కావల్సిన నిధులు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి చర్చా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి, పెండింగ్ దశలో ఉన్న పలు నిర్మాణ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్ కార్పోరేటర్ ఆగంపాండు ముదిరాజ్, ఎన్ఎంసి ఆయా విభాగాల అధికారుల, సిబ్బంది పాల్గొన్నారు.

# పేద విద్యార్థులపై వివక్ష తగదు

## బరిగెల దుర్గాప్రసాద్ మహరాజ్

మెహిదీపట్నం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త : ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులపై ప్రభుత్వం వివక్ష చూపించడం తగదని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బరిగెల దుర్గాప్రసాద్ మహారాజ్ అన్నారు. వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్ప డితే ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించక పోవడం శోచనీయ మన్నారు. వసతి గృహాల్లో ఆత్మ హత్యల సంఘటనలపై పూర్తి విచారణ జరిపించడంతో పాటు దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బరిగెల దుర్గాప్రసాద్ మహారాజ్ పాల్గొని మాట్లాడారు. ధర్నాలో ధర్మ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ మేడి కార్తీక్, రాష్ట్ర కో-కన్వీనర్ సైదాబాబు, ధర్మాసమాజ్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ జిల్లాల నాయకులు రాజ్‌కమల్, గోల్కొండ కృష్ణ, మల్లేపాక సైదులు, సురేష్, గణేష్, ప్రసాద్, రాజు, శివప్రసాద్, నర్సింగ్‌రావు, సంతోష్, ఇరిగి మల్లేష్, హర్ష, దేవేందర్, వెంకట్, బాబు, పరుశరాం, శ్రీదర్‌లు పాల్గొన్నారు.

# జెఇఇ మెయిన్స్‌లో సత్తాచాటిన రెసోనెన్స్ విద్యార్థులు



విద్యార్థులను సత్కరిస్తున్న పూర్ణచంద్రరావు తదితరులు

దుండిగల్, ఫిబ్రవరి 13 ప్రభాత వార్త: ఐఐటి, ఎన్ఐటిలలో ప్రవేశానికి సంబందించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) మెయిన్ తొలివిడత పరీక్ష ఫలితాల్లో రెసోనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబర్చారు. ఐఐటి, ఎన్ఐటి, ఎన్ఇఐటి, మెడికల్ ప్రవేశ పరీక్షలలో అగ్రశ్రేణి ర్యాంకులను సొంతం చేసుకున్నారు. అత్యద్భుత ప్రతిభతో ర్యాంకులను సొంతం చేసుకున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో రెసొనెన్స్ హైదరాబాద్ సెంటర్స్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన జెఇఇ పరీక్షల్లో రెసొనెన్స్ విద్యాసంస్థ మంచి ఫలితాలను సాధించిందన్నారు. ఇది రెసొనెన్స్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఒక అఖండ విజయంగా పేర్కొన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఒకే స్కూల్ ఒకే కాన్‌సెప్ట్‌తో విద్యార్థుల చదువులో మార్పు

## ఒయూ విసి ప్రొ.రవీందర్ యాదవ్



మాట్లాడుతున్న ఒ.యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్

తార్నాక, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ఒకే స్కూల్ ఒకే కాన్‌సెప్ట్‌తో ముందు కెళ్లితే విద్యార్థుల చదువులో మార్పు వస్తుందని ఓ.యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. యునివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యూకేషన్ ఆద్వర్యంలో మంగళవారం బీఈడీ కాలేజ్‌లో ఎంపవరింగ్ స్కూల్ గర్ల్స్ ఆఫ్ తెలంగాణ రోల్ ఆఫ్ కెజిబీవీస్ ఇన్‌ది లైట్ ఆఫ్ ఎన్ఈపి ..2020 పేరుతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథులుగా హాజరైన విసి.ప్రొ.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ బాలికల సాధికారిత కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. బాలికల పట్ల వివక్ష తొలగించేందుకు తల్లి,తండ్రులు చిన్ననాటి నుంచే అవగాణ కల్పించాలని సూచిం చారు. ప్రభుత్వ పాఠశాల్లో సరిపడ రెగ్యూలర్ టీచర్లు లేరని, స్కూల్స్‌లల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ వర్క్‌షాప్‌లో వివిద స్కూల్స్‌లల్లో నుంచి వచ్చిన విద్యార్థులు, టీచర్లు, ప్రొఫెసర్ల ఫీడ్ బ్యాక్ తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్టార్ ప్రొ.లక్ష్మినారాయణ, ప్రొఫెసర్లు గడ్డ మల్లేశం, డిపార్ట్ మెంట్ హెడ్ ప్రొ.టి.మృణాలిని, ప్రిన్సిపల్ ప్రొ.కె.మూర్తి, రమేష్ చంద్ర, ప్రొ. ఎస్.శ్రీనివాస్ రావు, రాజేష్ కుమార్, డా.డి.సునిత తో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిజామియా యునానీ ఆసుపత్రిని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు



యునానీ ఆసుపత్రిని సందర్శించిన చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు

చార్మినార్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : చార్మినార్ సమీపంలోని ప్రభుత్వ నిజామియా జనరల్ యునానీ ఆసుపత్రిని మంగళవారం చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ ముజీబుల్లా షరీఫ్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. యునానీ ఆసుపత్రి లోని రోగులను కలిసి ఆయన వైద్య సేవలు ఏవిధంగా అందుతున్నాయోతెలుసుకున్నారు. ప్రభుత్వ నిజామియా జనరల్ ఆసుపత్రిలోని అన్ని వార్డులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ముజీబుల్లా షరీఫ్ మాట్లాడుతూ యునానీ ఆసుపత్రి భవనం శిధిలావస్థకు చేరుకున్నదని, అదే విధంగా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, వైద్య పరికరాలు కొరత ఉందని తెలిపారు. యునానీ ఆసుపత్రికి మరమ్మతులు చేపట్టాలని, వైద్య సిబ్బందిని భర్తీ చేయాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రిని కలిసి వినతి పత్రం అందజేయనున్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ముసాకాశిం, సుల్తానా మీర్జా, హైదర్ జాఫ్రీ, యూసుఫ్ థానీష్, పురుషోత్తం గుప్తా, అస్లాం ఉల్లాషరీఫ్, చందూ, వరుణ్‌లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్షా ప్యాడ్ల అందజేత



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న బీజేపీ నేత మల్క కొమురయ్య

కంటోన్మెంట్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్తః మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని వెస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, జూనియర్ కళశాల విద్యార్థులకు, పికెట్ ప్రాథమిక పాఠశాలతో పాటు మరికొన్ని పాఠశాలల విద్యార్థులకు 50వేల పరీక్ష ప్యాడ్‌లను బీజేపీ నాయకుడు మల్క కొమురయ్య ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షా సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ప్రశ్నా పత్రాన్ని ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకున్న తరువాతనే జవాబులు రాయాలన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

నిజాంపేట్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త : 32వ డివిజన్ పరిధిలో రాజీవ్ గృహకల్ప తెలుగు తల్లి విగ్రహం వద్ద మంగళవారం మల్లారెడ్డి సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డా.చామకూర భద్రారెడ్డితో కలిసి మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి, డిప్యూటి మేయర్ ధనరాజ్ యాదవ్, స్థానిక కార్పోరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు చిట్ల దివాకర్, కోలన్ వీరేందర్‌రెడ్డి, ఎన్ఎంసి బిఆర్ఎస్ సెల్ జనరల్ సెక్రటరీ దశరథ్, స్థానిక రాజీవ్‌గృహకల్ప 31,32,33 డివిజన్ల అధ్యక్షులు బిక్షపతి, అశోక్, ముత్యాలు, మహిళా నాయకులు స్వర్ణకుమారి, నర్మద, సుకన్య, నాయకులు తొంట చందు, నాయక్, ఆర్‌జికె నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## జెఇఇ మెయిన్స్‌లో వికాస్ విద్యార్థుల ప్రభంజనం

నిజాంపేట్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త జెఇఇ మెయిన్స్ మొదటి విభాగంలో విడుదలైన ఫలితాల్లో విజయకేతనం ఎగురవేసిన వికాస్ ద కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు. 2024 సంవత్సరం జెఇఇ మెయిన్స్‌లో విద్యార్థులు అరుణ్ అయ్యప్పన్ (99.95), కమలేష్ (99.49), ఆదిసత్య (99.90), అర్చిసింగ్ (98.79), వంశీకృష్ణ (98.38), అబ్దుల్ ముఖీత్ (98.22), సాయి సాతియన్ (95.27), కర్నిమిశ్రీ (95.27), పవిత్రజైన్ (93. 00) పర్సంటేజ్‌తో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించారు. ఫలితాలు సాధించిన విద్యార్థులకు యాజమాన్యం, అధ్యాపక బృందం, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

# ఈనెల 18న మహర్షి దయానంద సరస్వతి ద్విశత జయంతి శోభాయాత్ర



ఆర్యసమాజ్ ప్రతినిధులు, జయంతి ఉత్సవ కమిటీతో హెచ్‌సియు విసి బిజె.రావు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: సంఘసంస్కర్త, మానవతావాది, దేశ స్వాతంత్ర్యోద్యయ ప్రణేత మహర్షి దయానంద సరస్వతి బోధనలపై నేటి యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, మహర్షి దయానందుడి ద్విశత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 18వ తేదీన నగరంలో పెద్దఎత్తున శోభాయాత్ర నిర్వహించనున్నట్లు హెచ్‌సియు వైస్ చాన్సిలర్, మహర్షి దయానందుడి జయంతి ఉత్సవాల కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ బిజె.రావు వెల్లడించారు. ఈమేరకు దేశ వ్యాప్తంగా రెండు సంవత్సరాల పాటు మహర్షి దయానంద సరస్వతి ద్విశత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తుండగా, ఉత్సవ కమిటీ సభ్యుడిగా నియమితులైన ప్రొఫెసర్ బిజె రావు ఆధ్వర్యంలో మంగళవారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆర్య సమాజ్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ బిజె.రావు మాట్లాడుతూ ఆర్యసమాజ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య ఉద్యమ ప్రధాత, వేదోద్ధారకుడు మహర్షి దయానంద సరస్వతి 200వ జయంతి ఉత్సవాలను భారత ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రెండు సంవత్సరాల పాటు 2023నుంచి 2025వరకు నిర్వహించేందుకు నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈమేరకు నగరంలో ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు నిజాం కళాశాల నుంచి రవీంద్రభారతి వరకు మహర్షి దయానంద ద్విశత జయంతి శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యుడు, ఆర్యసమాజ్ ప్రతినిధి డాక్టర్ ధర్మతేజ, భారత్ స్వాభిమాన్ కార్యనిర్వాహక కార్యదర్శి నందనం కృపాకర్‌లతో పాటు లక్ష్మణ్, రాజేశ్వర్, భరతమునీ, ప్రదీప్‌జాజు, భక్తరామ్‌జీ, యశ్‌పాల్, ఆర్యమునీ పాల్గొన్నారు.

## నల్లగొండ సభకు దుమ్మాకొట్టిన మాజీ బోర్డు మెంబర్లు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: బిఆర్ఎస్ పార్టీకి చెందిన కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండు యాదవ్, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పి.శ్యామ్‌కుమార్, మాజీ కార్పోరేటర్ ఆకులరూప హరిక్రిష్ణ, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నర్సింహ్మా ముదిరాజ్‌లు పార్టీలో చురుకైన వ్యక్తులు అయినప్పటికి నల్లగొండ సభకు దుమ్మా కొట్టారు. ఎమ్మెల్యే లాస్య నుంచి సమాచారం రాకపోవడంతో, వ్యక్తిగత కారణాలతో సభకు రాలేక పోయామని తెలిపారు.

# ఛలో నల్లగొండకు గులాబీ దండు





కంటోన్మెంట్ నుంచి తెలంగాణ నది జలాలపై నల్లగొండ సభకు తరలివెళ్లిన ఎమ్మెల్యే లాస్య నందిత, బిఆర్ఎస్ నేతలు, నల్లగొండ సభ ర్యాలీని ప్రారంభిస్తున్న సికింద్రాబాద్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్





బహిరంగ సభకు తరలివెళ్తున్న బిఆర్ఎస్ శ్రేణులు, జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ముఠా గోపాల్

**కంటోన్మెంట్..** తెలంగాణ నది జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం నల్లగొండలో నిర్వహించిన బిఆర్ఎస్ సభకు కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే లాస్య నందిత ఆధ్వర్యంలో వందలాది మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమ నేతలు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నివేదిత, టీ.ఎన్.శ్రీనివాస్, పనస సంతోష్, తేజ్‌పాల్, కె.బి.శంకర్, మురళీ యాదవ్, దినా నాథ్ యాదవ్, వాజీద్‌లతో పాటు వందలాది మంది తరలివెళ్ళారు.

**కృష్ణా జలాల హక్కులను కేంద్రానికి అప్పగించడం కాంగ్రెస్ ప్రభుత్వమే : తలసాని సాయి**

కృష్ణా జలాలపై హక్కులను కేంద్రానికి అప్పగించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సికింద్రాబాద్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ అన్నారు. నల్లగొండలో తలపెట్టిన బిఆర్ఎస్ బహిరంగ సభకు మంగళవారం మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో తలపెట్టిన కార్ల ర్యాలీని మంగళవారం మారేడ్‌పల్లిలోని మునిసిపల్ ప్లే గ్రౌండ్ నుంచి తలపెట్టిన ర్యాలీని తలసాని సాయికిరణ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ శేషుకుమారి, బిఆర్ఎస్ నాయకులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, అత్తేల్లి మల్లికార్జున్ గౌడ్, కొలను బాల్ రెడ్డి, నాగులు, తలసాని మహేశ్ యాదవ్, ధర్మేందర్ యాదవ్, స్కైలాబ్ యాదవ్, లక్ష్మిపతి, ఓదెల సత్య నారాయణ, రాములు పాల్గొన్నారు.

**అడ్డగుట్ట నుంచి తరలివెళ్లిన బిఆర్ఎస్ శ్రేణులు**

**అడ్డగుట్ట..** కృష్ణా నది జలాలపైన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం నల్లగొండలో తలపెట్టిన బిఆర్ఎస్ బహిరంగ సభకు అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో వందలాది మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క మధు, లింగాని శ్రీనివాస్, పెండెం మనోహర్, సత్తయ్య గౌడ్, ఎల్లయ్య, వసంత, ఇస్మయిల్, మహ్మద్, కైరం కొండ యాదగిరి, పొన్నాల రాజు, శ్రీరాములు, రవి పాల్గొన్నారు.

**కెపిహెచ్‌బి కాలనీ..** శేరిలింగంపల్లి నియోజకవర్గ శాసనస భ్యులు అరికెపూడి గాంధీ పిలుపు మేరకు వివేకానంద నగర్ డివిజన్ కార్పోరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు ఆధ్వర్యంలో మంగళవారం వివేకానంద నగర్ డివిజన్ నుండి బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ కార్పోరేటర్ మాధవరం రంగారావు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాచర్ల భద్రయ్య, కొమ్మగళ్ళ మోజేష్, లక్ష్మీనా రాయణ, ఆంజనేయులు, లింగయ్య, చంద్రమోహన్ సాగర్, విద్యాసాగర్, శివసాగర్, శ్రీనుసాగర్, పల్లపుబాబు, సంపత్, కృష్ణరావు పాల్గొన్నారు.



ఛలో నల్లగొండ కార్యక్రమానికి బయలుదేరిన బిఆర్ఎస్ నాయకులు

**ఛలో నల్లగొండకు తరలివెళ్లిన ముషీరాబాద్ గులాబీ శ్రేణులు**

**ముషీరాబాద్..** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా ఛలో నల్లగొండ భారీ బహిరంగ సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుండి గులాబీశ్రేణులు బస్సులలో ర్యాలీగా తరలి వెళ్లారు. మంగళవారం ఉదయం భోలక్‌పూర్‌లోని ఘంటసాల క్రీడా మైదానం నుండి నల్లగొండకు బయల్దేరిన బస్సులను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువనేత ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్, స్థానిక బీఆర్ఎస్ నేతలు ముచ్చుకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, సుధాకర్‌గుప్తా, దీన్‌దయాళ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేట్..** కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక వైఖరిని ఖండిస్తూ కేంద్రం నుండి తెలంగాణ సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఛలో నల్లగొండ పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ నుండి బయలు దేరిన డిప్యూటి మేయర్ ధనరాజ్ యాదవ్, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్పోరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, 12వ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు, ఆయా డివిజన్ అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు భారీగా బయలుదేరడం జరిగింది.

# పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, వంశీ రామరాజు, వంగూరి చిట్టెన్‌రాజు తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ప్రపంచవ్యాప్తంగా సాహిత్యసభలను నిర్వహించి, తెలుగువారిని ఒకేతాటిపైకి తెచ్చి ఆలోచన పరిధిలోకి తెచ్చిన వ్యక్తి వంగూరి చిట్టెన్‌రాజు అని శ్రీ వేంకటటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో ప్రచురించిన ప్రత్యేక గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ నిర్వాహక సంస్థ మేనేజింగ్ ట్రస్టీ, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభలను ప్రపంచంలో తొమ్మిది ప్రాంతాలల్లో నిరహించిన గొప్ప వ్యక్తి చిట్టెన్‌రాజు అని అన్నారు. శ్రీదేవి మురళీధర్ అనువదించిన 'స్వయం సిద్ధి' గ్రంథాన్ని సినీనటులు తనికెళ్ళ భరణి, దయాస్పోరా తెలుగు కథానిక-2023-17వ సంకలనంను ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, వంగూరి చిట్టెన్‌రాజు రచించిన అమెరి 'కాకరకాయ కథలు'- కమామీషులూ' గ్రంథాన్ని తెలుగు వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రపంచ భూమండలంలోని అన్ని ఖండాలలో సాహితీ సభలను ప్రపంచంలో నిర్వహించిన ఏకైక వ్యక్తి హాస్యబ్రహ్మ డాక్టర్ వంగూరి చిట్టెన్‌రాజు అని వక్తలు కీర్తించారు. ఆయన ఎక్కడ ఉన్నా కూడా ఏదో ఉన్న వ్యక్తి సాహితీ సంచలనం వంగూరి చిట్టెన్‌రాజు అని అన్నారు. సభను గురుసహస్రావధాని డాక్టర్ కడిమిళ్ళ వరప్రసాద్ ప్రారంభించిన ముఖ్య అతిథిగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ హాజరవగా సభకు ఫౌండేషన్ వ్యవ స్థాపకులు, అమెరికా హాస్యబ్రహ్మ డాక్టర్ వంగూరి చిట్టెన్‌రాజు అధ్యక్షత వహించారు.

## తూర్పు మండలం డీసీపీగా రావుల గిరిధర్



సికింద్రాబాద్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: హైదరాబాద్ తూర్పు మండలం డిప్యూటీ కమిసనర్ ఆఫ్ పోలీస్‌గా రావుల గిరిధర్ నియమితులయ్యారు. రాచకొండ పరిధిలోనిమల్కాజ్‌గిరి ఎస్ఓటీ డీసీపీగా సేవలు అందించిన ఆయన పార్లమెంట్ ఎన్నికల కారణంగా బదిలీపై తూర్పు మండలానికి డీసీపీగా వచ్చారు. ఎస్ఓటీ డీసీపీగా ఆయన పలు కీలకమైన కేసులలో ప్రతిభను చాటారు. నిజాయితీగల అధికారిగా మంచి గుర్తింపును పొందారు. హైదరాబాద్ నగరంలోని పలు డివిజన్‌లలో సేవలు అందించిన విషయం తెలిసిందే.

## కూకట్‌పల్లి ఎసిపిగా కాపుగంటి శ్రీనివాసరావు



కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త: సైబరాబాద్ కమీషన రేట్ పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్ ఏసీపీగా కాపుగంటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర డిజిపి గుప్తా శ్రీనివాసరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ కమీషనరేట్ పరిధిలోని ఐటీ సెల్, పిసిఎస్ అండ్ ఎస్ విభాగం ఏసీపీగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు కూకట్‌పల్లి డివిజన్ ఏసీపీగా బాధ్యతలు అప్పగించారు. గత 2010 నుండి 2013 వరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా కాపుగంటి శ్రీనివాసరావు పనిచేశారు. శ్రీనివాసరావు కూకట్‌పల్లి ప్రాంతంలో లా అండ్ ఆర్డర్ విషయంలో కఠినమైన నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో పలువురు నాయకులు ఆయనపై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది.

## నార్సింగిని ఆదర్శ మున్సిపల్‌గా మారుస్తా

### నూతన కమిషనర్ టి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి



నార్సింగి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : నార్సింగిని రంగారెడ్డి జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా మారుస్తానని నూతన కమీషనర్ టి.ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఇన్నాళ్లు ఇక్కడ పని చేసిన సురేందర్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్‌పూర్‌కు బదిలీ చేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో పని చేస్తున్న ప్రవీణ్ కుమార్‌రెడ్డిని నార్సింగికి మార్చారు. మంగళవారం ప్రవీణ్ కుమార్‌రెడ్డి పదవీ బాధ్యతలు తీసుకొని, మున్సిపల్ సిబ్బంది అందరితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది సూచనలు, సలహాలు పాటిస్తూ, వారందరిని భాగస్వాములుగా చేస్తూ నిరంతరం మున్సిపల్ అభ్యున్నతికి పాటు పడుతానని స్పష్టం చేశారు. మనకు అప్పగించిన పనిని అంకిత భావంతో చేస్తే మెరుగైన ఫలితాన్ని సాధించవచ్చని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ప్రజల ప్రధాన సమస్యలు ఏమీ? ఏ విధమైన నిర్ణయాలు తీసుకుంటే వాటిని త్వరగా పూర్తి చేయగలము? అన్న అంశాలపై చర్చించి అందరి ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని తీసుకొంటామన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ పవన్ కుమార్, ఆర్.ఓ యోగేష్ తదితర సిబ్బంది కమీషనర్‌కు పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## పేద బస్తీలపై నిర్లక్ష్యాన్ని వీడాలి

### కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



పనులను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరం చేస్తామని పాలకులు పేద బస్తీల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్యరాష్ట్రాల వ్యవహారాల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడితండలో తన ఎంపి నిధులతో వేసిన బోర్‌వెల్, వాటర్ ట్యాంకులను రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. నగరాభివృద్ధిలో నిధుల కొరత ఉందని అధికారులు చెప్పడం సిగ్గుచేటు అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా అంతర్జాతీయ నగరంగా నగరాభివృద్ధి చేస్తున్నామని ప్రకటనలకే పరిమితం చేశారని, ఇప్పుడు ఉన్న పాలకులు కూడా నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. నగరంలో అనేక పేద బస్తీలలో డ్రైనేజీ, వీధిదీపాలు, మంచినీటి సమస్యలున్నాయని, అయినా అధికారులు నిధులు లేవని చెప్పడం బాధాకరమన్నారు. 30శాతం జనాభా ఉన్న నగరంలో సౌకర్యాలు లేకపోవడం విచారకరమన్నారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ పేదలను ఆదుకుంటున్నామని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే గాంధీనగర్‌లోని వివేకానందనగర్ బస్తీలో నివాసం ఉంటున్న దళితుల ఇళ్ళను కూల్చివేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారికి ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చారి, బిజెపి సీనియర్ నేతలు బండారు విజయలక్ష్మి, పూస రాజు, రమేశ్‌రామ్, సి.పార్థసారథి, మద్దూరి శివాజీ, జిహెచ్‌ఎంసి సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ దేవాలయంలో పూజలు



బాపూజీ నగర్ ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్టాపలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ఒటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్‌లోని శ్రీ ముత్యాలమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ట వేడుకల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యే క పూజలు జరిగాయి. సికింద్రాబాద్ మహంకాలి ఆలయ ప్రధాన అర్చకులు వేణు మాధవ శర్మ, వేద పండితుల చేతుల మీదుగా విగ్రహ పున నిర్మాణ పనుల పూజలు జరిగాయి. ఈ కార్యక్ర మంలో ఆలయ చైర్మన్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దుర్గయ్యలు పాల్గొని పూజలు నిర్వహించారు.

## పేద విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయం



పభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ సామాగ్రి అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్

నిజాంపేట్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త : నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ ప్రగతినగర్ 22వ డివిజన్‌కు చెందిన మేడా శ్రీనివాస రావు జన్మదినం సందర్భంగా 22వ డివిజన్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లల కు పుస్త కాలు, స్టేషనరీ ఐటమ్స్‌ను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డి మాట్లా డుతూ పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేసి, విద్యా వాలంటీలకు తనవంతు బాధ్యతగా నెలవారి జీతం ప్రకటిం చిన మేడా శ్రీనివాస్‌ను అభినందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంతర్‌రాష్ట్ర గణిత పోటీలు




మెహిదీపట్నం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త : గుడిమల్కాపూర్‌లోని మాస్టర్ కిడ్స్ అకాడమి ఆధ్వర్యంలో అంతర్‌రాష్ట్ర గణిత పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎడ్యూకేషనిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ప్రముఖురాలు డాక్టర్ వి.శ్రీవేణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిభను పెంపొందించడం మరియు గణితంలో అకడమిక్ ఎక్సలెన్స్ ప్రోత్సహించడంతో మాస్టర్ కిడ్స్ అకాడమీ యొక్క నిబద్ధతను ప్రదర్శిస్తుందన్నారు. మాస్టర్ కిడ్స్ అకాడమి ఐదు విభాగాలలో పోటీలు నిర్వహించగా 2000 మంది విద్యార్థులు పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమ మోనికా కొత్త స్వాగత ఉపన్యాసం చేయగా స్పేస్ వాక్ ఇంటర్‌నేషనల్ ప్రీ స్కూల్ డైరెక్టర్ వి.విశాలి, శ్రీగాయత్రి స్కూల్ ప్రిన్సిపల్ సి.హెచ్. జశ్విన్, ఎంఎన్‌వివికె.చైతన్య, కనక్ మధపెద్ది చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

### తెలంగాణ నాన్ గజిటెడ్
## ఇఎన్‌టి ఆసుపత్రి నూతన కార్యవర్గం



అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 13ప్రభాతవార్త: తెలంగాణ నాన్ గజిటెడ్ ఇఎన్‌టి ఆసుపత్రి నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈసందర్భంగా తెలంగాణ నాన్‌గజిటెడ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఇఎన్‌టి ఆసుపత్రి ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు ముజీబ్‌హుస్సేనీ శాలువ కప్పి సన్మానించారు. ఇఎన్‌టి ఆసుపత్రి కార్యవర్గం టి.రాజు ,ఎన్.సి రాజేందర్, బి.రాజు, ఎస్.రవి, ఇ.బాస్కర్, మహ్మద్ అజ్మత్‌అలీ, మక్బూల్, వెంకట్‌రెడ్డి, వైదిక్‌శాస్త్రి పాల్గొన్నారు.

## ఫలక్‌నుమాలో పర్యటించిన ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్



చార్మినార్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : ఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ మంగళవారం బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌తో కలిసి నియోజకవర్గంలోని ఫలక్‌నుమా డివిజన్‌లో పర్యటించారు. కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన వాటర్ పైప్ లైన్ పనులకు ఆయన శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో పలువురు ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున ఎంఐఎం నాయకులు ఎంపి అసదుద్దీన్ ఓవైసీకి స్వాగతం పలికారు.

### శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజానికి
## అందుబాటులో ఉంటా: జగదీశ్వర్‌గౌడ్



బస్తీలో పర్యటిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి లోని అన్ని డివిజన్‌లో సమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉంటానని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే వి.జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీలో డివిజన్ పరిధిలోని జయశంకర్ నగర్ బస్తీలో జగదీశ్వర్‌గౌడ్ మంగళవారం పర్యటించి స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను ప్రజలు జగదీశ్వర్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. వారి పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలు ప్రభుత్వం మధ్య సమస్యలను తీర్చే వారధిగా నిలుస్తానని ఈ సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మారేళ్ళ శ్రీనివాస్, మనెపల్లి సాంబశివరావు, శేషు, సత్తూర్, రవి, రఫిక్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీల అస్తిత్వం సంఘర్షణే తన రచనలు : శీలా సుభద్రాదేవి



శీలా సుభద్రాదేవిని సన్మానిస్తున్న శివారెడ్డి, చెన్నయ్య, సిల్మానాయక్

నాంపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : కులం, లింగభేదం ఈ రెండు పడగల నీడ కింద నలిగిపోతున్న స్త్రీలు తమ అస్తిత్వం కోసం పడే సంఘర్షణే తన రచనల్లో ఎక్కువగా కనిపిస్తా యని ప్రముఖ కవయిత్రి, రచయిత్రి శీలా సుభద్రాదేవి తెలిపారు. బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహిస్తున్న ప్రఖ్యాత కవి రచయితల స్వీయసాహిత్య జీవిత విశేషాల ప్రసంగపరంపర నేను-నా రచనలు కార్యక్రమంలో శీలా ప్రసంగించారు. కథారచనతో సాహిత్యరంగంలో అడుగుపెట్టినా కవిత్వంపై మక్కువని, ఇతర ప్రక్రియలను అలక్ష్యం చేయలేదని తెలిపారు. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో నేటి కవులు, రచయితలు ముందుతరం సృజనకారుల రచనలను చదివి అవపోసిపట్టి వారి నుండి స్ఫూర్తి పొందాలన్నారు. సుభద్రాదేవి 2 కథా, 11 కవితా సంపుటాలను వెలువరించారని, స్త్రీల సమస్యల చిత్రణకు ప్రాధాన్యమిచ్చారి అన్నారు.

## నాలుగవ తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ఉస్మానియా ఆసుపత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కమీషన్ సఫాయి కర్మచారి వెంకటేశం,ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ తదితరులు

బేగంబజార్, ఫిబ్రవరి 13ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుపత్రిలో విధులను నిర్వహించే నాలుగవ తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్క రించేందుకు కృషి చేస్తానని జాతీయ కమీషన్ సఫాయి కర్మచారి చైర్మన్ వెంకటేశం అన్నారు. మంగళవారం ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ విధులను నిర్వహిస్తున్న నాలుగవ తరగతి ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలోజీతాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతానాలను అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ బి.నాగేందర్, పస్ట్.ఆర్.ఓ డాక్టర్ శేషాద్రి, ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ నెహ్రూనాయక్, ఆర్.ఎం.ఓ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంగూడలో చెయిన్ స్నాచింగ్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ఆర్టీసి బస్సు దిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న ఓ గృహిణి మెడలో నుండి బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి తెంపుకొని పారిపోయాడు. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ కాశీ విశ్వనాథ్ కథనం ప్రకారం గుర్రంగూడ టీచర్స్ కాలనీకి చెందిన బోయపల్లి సంధ్యారాణి (30) అనే మహిళ దేవరకొండ నుండి ఆర్టీసి బస్సులో సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో వచ్చి గుర్రంగూడ క్రాస్ రోడ్డులో దిగింది. ఆ తర్వాత ఆమె ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తి ఆక్టీవా వాహనంపై వచ్చి రెప్పపాటులో ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు గొలుసును తెంపుకొని పారిపోయాడు. ఈ నేపథ్యంలో ఆమె ఫిర్యాదు చేయగా మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసుకొని సిసి పుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

మొదటి పేజీ తరువాయి..

స్వయం ఉపాదికోసం ఆటోలను నడుపుతూ ఎంతో మంది తమ కుటుంబాలను పోషించుకుంటారన్నారు. నిత్య అవసర సరుకులు రవాణా కావాలన్న ట్రక్‌లు కావాల్సిందే అన్నారు. నగరంలో ఎక్కువగా ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడంతోనే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలను నివారించాలంటే ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందేనన్నారు. ఇంట్లోనూ, గుడిలోనూ, స్కూల్‌లోనూ నిబంధనలు పాటిస్తాము కానీ రోడ్డుపై వచ్చాక మాత్రం ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదన్నారు. ఖచ్చితంగా పాటించాల్సింది రోడ్డుపైనేనన్నారు. అప్పుడే ప్రమాదాలు జరుగవన్నారు. నిబంధనలు పాటించని వారికి అనేక విధాలుగా చలాన్‌లు వేస్తున్నా ప్రయోజనం మాత్రం కనిపించడం లేదన్నారు. ఆటో, ట్రక్ డ్రైవర్ల ఆరోగ్యం కోసం పరీక్షలు చేసిన వారిని అభినందించారు.

**నేను బ్రతికి ఉండడానికి హెల్‌మెట్ కారణం: జొన్నలగడ్డ సిద్దు.**

నేను బ్రతికి ఉండడానికి హెల్‌మెట్ కారణమని సినీ హీరో జొన్నలగడ్డ సిద్దు తెలిపారు. నాకు రెండుసార్లు ప్రమాదాలు జరిగాయని, రెండు ప్రమాదాల్లోనూ నాకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. నేను బైక్ వెల్లేటప్పుడూ హెల్‌మెట్ తప్పకుండా దరించడంతో పాటు కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ తప్పకుండ వేసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ ధనలక్ష్మి, ఆటో, ట్రక్ డ్రైవర్లు పాల్గొన్నారు.

## కనువిందుగా జాతీయ సంగీత నృత్యోత్సవాలు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : జాతీయస్థాయిలో ఔత్సాహిక చిన్నారి నర్తకీమణుల వైవిధ్యభరిత సంప్రదాయ, సాంస్కృతిక నృత్యవిన్యాసాలు, నవరసభరిత కీర్తనలు, భజనలతో సంగీత నృత్యోత్సవాలు వందలాది విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ శిష్యబృందంచే రవీంద్రభారతి ప్రధాన మందిరాన్ని పునీతం చేశాయి. సంగీతం, నృత్యంపట్ల అమితాశక్తిని ప్రదర్శిస్తున్న సంస్థ శిష్యగణం ఉత్సాహ ఉల్లాసభరితంగా విభిన్నరీతుల ప్రదర్శనలు అంబరాన్నంటాయి. ముఖ్యంగా ఉభయ తెలుగురాష్ట్రాల నుండి విచ్చేసిన కళాకారులు శాస్త్రీయ కూచిపూడి, భరతనాట్యం, జానపద, త్యాగరాజ, అన్నమయ్య కీర్తనలతో మంత్రముగ్ధులను చేయగా ఇతర రాష్ట్ర కళాకారులు కథక్ తదితర స్థానిక జానపద సంప్రదాయ నృత్యాలతో అబ్బురపరిచారు. ఈ సందర్భంగా రాధామోహన్ దంపతులు, అను, శశికళారెడ్డి, రాణి, విమల, నీలం తదితరుల చేతులమీదుగా ప్రముఖ నాట్యగురువులు అస్మిత, అక్షిత తదితరులు, వివిధ ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

## ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో బిజెపి ప్రభుత్వ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం




సదస్సులో ప్రసంగిస్తున్న బాలబోయిన సుదర్శన్. చిత్రంలో చాయాదేవి, స్టాలిన్

సైఫాబాద్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:మహారాష్ట్రలో 17వ శతాబ్ధంలో ఉన్న వైదిక, బ్రహ్మణీయ ఆదిపత్య కులాలు మాత్రమే రాజ్యాన్ని పాలించాలని, శూద్రులు రాజ్యాన్ని పాలించడానికి వీలులేదనే సంస్కృతిని ధిక్కరిస్తూ పిస్వాలా వ్యతిరేకంగా మహారాష్ట్రలో మరాఠా సామ్రాజ్యాన్ని నెలకోల్పిన శూద్రకులాల, కార్మిక వర్గం ప్రజల ప్రతినిధి ఛత్రపతి శివాజీ అని పూలే-అంబేద్కర్ సెంటర్ ఫర్ పిలాసాఫికల్, ఇంగ్లీష్ ట్రైనింగ్ డైరెక్టర్ డా.బాలబోయిన సుదర్శన్ చెప్పారు. సిపిఐ హైదరాబాద్ సమితి ఆధ్వర్యంలో మంగళవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో మతసామరస్యాన్ని నెలకోల్పిన ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను స్మరించుకుంటూ ఆయన అశయాలు, లక్ష్యాల కోసమే పోరాడుదాం అనే అంశంపైన జరిగిన సదసు స్లో ఆయన ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్య రాకముందు, ఆ తరువాత కొంత మంది బ్రహ్మణీయ భావజాలం కలిగిన రాజకీయ నాయకులు, పార్టీలు శివాజీని హిందూ ధర్మాన్ని, మతాన్ని, ముస్లిం రాజుల నుంచి కాపాడిన వ్యక్తిగా ముస్లిం వ్యతిరేకిగా చరిత్రను వక్రీకరించారని ఆయన ఆరోపించారు. ఛత్రపతి సైన్యంలో 3 వంతులలో ఒక వంతు ముస్లింలు, ఇంకొక వంతు శూద్రులు, మరొక వంతు అంటరాని వారు ఉండేవారని, శివాజీ అన్ని మతాలకు, కులాలకు ప్రాధాన్యత కల్పించారని దీనిని అందరూ గుర్తించాలని ఆయన సూచించారు. బిజెపి అనుసరిస్తున్న కార్మికుల వ్యతిరేకంగా విధానాలకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, సభ్యులు నళిని, నెర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, చెట్టుకింద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సరోజినీనాయుడు జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: కవి, రచయిత్రి, బహుభాషా పండితురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు, మాజీ గవర్నర్, గానకోకిల సరోజినీనాయుడు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని లోకదళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు కొనియాడారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆమె జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరోజినీ నాయుడు జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని కొనసాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌ముదిరాజ్, గోపాల్‌సింగ్, అనిల్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### నూతన డ్రైనేజీ పైప్‌లైన్‌కు శంకుస్థాపన

హైదరాబాద్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: కాచిగూడ డివిజన్‌లోని లింగపల్లి వినాయకుడి గుడి వద్ద శనివారం ఉదయం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నూతన డ్రైనేజీ పైప్‌లైన్‌కు శంకుస్థాపన చేయనున్నారని బిఆర్ఎస్ పార్టీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### నేడు ఎ.ఎల్.మల్లయ్య ప్రథమ వర్ధంతి

సైఫాబాద్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ప్రదేశ్ గంగ పుత్ర సంఘం మాజీ అధ్యక్షుడు ఎ.ఎల్.మల్లయ్య ప్రథమ వర్ధంతి బుధవారం ఉదయం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బిఎం నగర్‌లో జరుగుతుందని యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబటి మల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

## నేత్రపర్వంగా శాంతి కల్యాణ మహోత్సవం



చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: భక్తులు తెలికిస్తుండగా, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీశృంగేరి జగద్గురు మహాసంస్థానము శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీనివాసుడి శాంతి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా సాగింది. ఆలయం ధర్మా ధికారి కళావిఎస్. జనార్దనమూర్తి, సీఈవో, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ విఆర్‌గౌరీశంకర్ ఆధ్వర్యంలో జరుగు తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా సుప్రభాతం, విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణాలు, నిత్యహోమం, బలిహరణ అనంతరం శాంతి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేసి అనంతరం కల్యాణక్రతువును పూర్తి చేశారు. అనంతం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికి అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. కాగా బుధవారం ఉదయం సుప్రభాతం, విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణాలు, వేదస్వస్తి, 'మహ సుదర్శన హోమం', నిత్యహోమం, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద గోష్టి ఉంటుంది. సాయంత్రం విష్ణుసహస్రనామపారాయణాలు, సంగీత కార్యక్రమం, హోమం, శేషవాహన సేవ, తీంపసాద గోష్టి ఉంటుంది.

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL -MALKAJGIRI DISTRICTAT: MEDCHAL
O.S. No. 19 OF 2024
Between:
1. Smt. Uddemarri Vijayalaxmi W/o Late Uddemarri Sattaiah, aged about 64 years, Occ: Housewife,
2. Sri.Uddemarri Mahesh KumarS/o. Late UddemarriSattaiah, aged about 43 years, Occ: Agriculture,
3. Sri.Uddemarri PrabhakarS/o Late UddemarriSattaiah, aged about 36 years, Occ: Agriculture,
4. Smt.Uddemarri Krishna Veni,D/o Late UddemarriSattaiah, aged about 43 years, Occ: Housewife,
5. Smt.Uddemarri Anuradha,D/o Late UddemarriSattaiah, aged about 38 years, Occ: Housewife,
All R/o H.No. 5-168, Gundlapochampally Village, Medchal Mandal, Medchal-Malkajgiri District, TS ...Plaintiffs
AND
1. The Tahsildar, MRO, Medchal Mandal, RangaReddy District
2. All Concerned ...Defendants
To,
All Concerned,
This is to inform the general public that the plaintiffs have filed the above suit for declaration to declare them as legal heir of deceased Late Uddemarri Sattaiah. The said suit is posted on 28-02-2024 at 10:30 A.M. if anybody has any objections kindly appear before the above Hon'ble Court on 28-02-2024 at 10:30 A.M. either in person or through advocate, failing which the matter will be decided in your absence as per law.
//BY ORDER OF THE COURT//
M/s. DIVYA RAI, Advocate
302, 3rd Floor, Thirath Towers, Road No. 7, Banjara Hills, Hyderabad-500 034,
Ph: +91 9110314175

## ఏళ్ల తరబడి సాగుతున్న కల్వర్టు పనులు పరిశీలించిన నేతలు



మిషన్ భగీరథ పనులకు అడ్డుగా నిల్చిన కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించిన బిజెఎంసి కాంగ్రెస్ పార్టీ నాయకులు

నార్సింగి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం చేసిన మిషన్ భగీరథ పనులు ఇంకా కొనసాగుతుండడం వారి నిర్లక్షానికి నిలువెత్తు నిదర్శనంగా అత్తాపూర్-పిఅండ్‌టి కాలనీ పనులు నిలిచాయని బిజెఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాంగ్రెస్ నాయకుల బృందం ఏళ్లుగా నిల్చిపోయిన కల్వర్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత సర్కారు గప్పాలకే అధిక ప్రాధాన్యతనిచ్చిందని, ప్రజల సమస్యల పరిష్కారంపై అశ్రద్ద చేసిందని ఆరోపించారు. మిషన్ భగీరథతో ఇంటింటికి కుళాయి ద్వారా మంచినీరు ఇచ్చామని పదే పదే డబ్బా కొట్టుకున్న బిఆర్ఎస్ పెద్దలు ఎందుకు ఏళ్ల తరబడి అత్తాపూర్-పిఅండ్‌టీ కాలనీ వద్ద కల్వర్టు పనుల కారణంగా ఆగిపోయిన మంచినీటి పైప్‌లైన్ పనులను పూర్తి చేయించలేదని ప్రశ్నించారు. చారాణా కోడికి బారాణా మసాల అన్న చందంగా గత సర్కారులోని పెద్దలు ఇబ్బడి ముబ్బడిగా ప్రజల సొమ్మును ఖర్చు చేశారని, దోచుకున్నారని మండిపడ్డారు. ఏళ్లుగా నిలిచిపోయిన కల్వర్టు, పైప్‌లైన్ పనులను పరిశీలించిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, నవీన్, శ్రీనివాస్, ప్రేమ్, సంతోష్, విష్ణు, రాంప్రసాద్, మహ్మద్ అయూబ్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

## ఆకాశవాణిలో ప్రసారమయ్యే అన్ని కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనాలి

**ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్ ఉదయ్‌శంకర్**




చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ఆకాశవాణిలో ప్రసారమయ్యే అన్ని కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనాలని స్టేషన్ డైరెక్టర్ ఉదయ్‌శంకర్ సూచించారు. ప్రపంచ రేడియో దినోత్సవ కార్యక్రమం మంగళవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ డిగ్రీ కళాశాల జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆకాశవాణి కేంద్రాన్ని విద్యార్థినీ విద్యార్థులు సందర్శించారు. ఆకాశవాణి సెమినార్ హాల్‌లో రేడియో దినోత్సవాన్ని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టేషన్ డైరెక్టర్ ఉదయశంకర్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రేడియో ఆవిర్భావ విశేషాలు, రేడియోలోని వ్యవసాయ కార్యక్రమాలు, విద్య, ఉద్యో, ఉపాధి వంటి అనేక అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ చర్చా కార్యక్రమంలో జర్నలిజం విభాగం విద్యార్థులు పాల్గొని అనేక అంశాలపై వివరాలు అడిగి తెలుసుకుని అవగాహన పొందారు. అనంతరం ఆకాశవాణిలో వివిధ విభాగాల పనితీరు, కార్యక్రమాల నిర్వహణ విషయాలను విద్యార్థులు పరిశీలించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలతో కార్యక్రమం ముగిసింది.



మణికొండ మున్సిపల్ మాజీ కమిషనర్ ఫల్గున్ కుమార్ ఘనంగా సత్కరించి, వీడ్కోలు తెలుపుతున్న చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మేనేజర్ రమేష్

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM IV ADDL. METROPOLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DIST, UPPAL AT LB NAGAR
O.S.NO 576 OF 2023
Between:
BANK OF INDIA, Parvathapur Branch, Medchal-Malkajgiri Dist. Hyderabad ...Plaintiff-Bank
AND
1) M. Jagan Mohan Reddy, S/o. M. Bikshapathi Reddy, Age about 43 years, Occ: Business, Proprietor M/s. SVS Laser Colour Lab & Digital Studio, Door No.2-3-35/4/B/1/14, Vijayapuri Colony, Uppal, Medchal-Malkajgiri Dist
Second Address
M. Jagan Mohan Reddy, S/o. M. Bikshapathi Reddy, Age about 43 years, Occ: Business, Proprietor M/s. SVS Laser Colour Lab & Digital Studio, R/o. Plot No.11, Ganesh Nagar, Peerjadiguda, Mediplly Mandal, Medchal-Malkajgiri Dist.
2) Mr. Anumula Narasimha Reddy, S/o. A. Raji Reddy, Aged about 52 years, Occ: Business, R/o. H.No.9-14/2, Sri Ramnagar Colony, Peerjadiguda, Mediplly Mandal, Medchal-Malkajgiri Dist ...Defendants
Please take notice that the Plaintiff Bank above named filed the above suit against you for recovery of money of Rs. 7,54,460/- together with interest and costs. The said suit stands posted to 01-03-2024 for your appearance either in person or through your advocate at 10.30 AM. If you failed to appear before the said court on the date and time mentioned above the matter will be heard and decided exparte.
By Order of the Court
S/d. M. Saidaiah
M. Devender Reddy
Advocates
Plot No.204, 2nd Floor
Sri Nilaya Residency Green Park Colony
Karmanghat, Hyderabad
Counsels for Plaintiff

IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD.
O.S. No.644 of 2024
Between:
Smt. Rangappagari Anjamma, W/o/ Sri R Yadagiri Goud, Aged about: 60 years, Occ; Household, R/o. Flat No. 202, Anand Nilayam, H. No. 7-1-79, 80, Ameerpet, Ameerpet Mandal, Hyderabad-500 038 ... Plaintiff
AND
1. Smt. Rangappagari Hemalatha, W/o. Late Rangappagari Sai Baba Goud, Aged about: 36 years, Occ; Household.
2. Baby Rangappagari Akshainie, D/o. Late Rangappagari Sai Baba Goud, Aged about: 4 years, Occ; Student, Being Minor represented by her natural mother Smt. Rangappagari Hemalatha, W/o. Late Rangappagari Sai Baba Goud, Aged about: 36 years, Occ; Household, No-1 & No-2 are R/o. H. No. 12-10-587/16, Medibhavi, Sithapalmandi, Musheerabad Mandal, Secunderabad, Hyderabad-500 061.
3. The Thasildar, Ameerpet Mandal, Hyderabad District, Hyderabad.
4. All Concerned
... Defendants
To, Defendant No-4
To,
Whom so ever all concerned
Please take notice that the Plaintiff herein has filed the above suit to declare the Plaintiff and the Defendant No-1 & No-2 as the Legal Heirs of the deceased Rangappagari Sai Baba Goud, who died on 08.01.2024 for legal status purpose only. The above Said case is posted to 14.03.2024 at 10.30 am. In the above Court, If anybody is having any claim or objection may approach this Hon'ble Court with valid documents, either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.
// By Order Of the Court //
MOOLA MURALI MOHAN,
Advocate
Flat No-3, Dharani Sai Shelters, Padmarao Nagar, Secunderabad-500 025.
9848238766

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
నిట్ సం. టెండరు నోటీసు: 23/E/HD/UPL/GHMC/2023-24, తేదీ: 12.02.2024
పనిపేరు: "షబ్-ఇ-బరాత్ 2024 దృష్ట్యా హబ్సిగూడ వార్డ్ నెం.8లో పిఅండ్‌టి కాలనీ వద్ద ముస్లిం కబరిస్థాన్ ప్రహరీ గోడకు పెయింటింగ్ మరియు జంగిల్ క్లియరెన్స్ కొరకు కాంట్రాక్టుని నియామకం" 1 పని కొరకు. అంచనా మొత్తం : రూ.2.20 లక్షలు. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 16.02.2024, ఉ.11.00గం. అధికారి పేరు మరియు చిరునామా : శ్రీ ఎల్.నాగేందర్ EE, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నం.2,GHMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.Tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
DIPR.No.10412-PP/CL/Advt/1/2023-24 తేదీ: 13.02.2024 సం/-ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-2, GHMC.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
నిట్ సం & తేదీ: 34/DB/EE/Alwal Circle/GHMC/2023-24, తేదీ:13.02.2024
పనిపేరు: CC రోడ్డు వేయుట. అంచనా మొత్తం రూ.లక్షల్లో : 20.00. ప్రారంభ తేదీ మరియు సమయం: 14.02.2024, సా.4.00గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం : 22.02.2024 సా.4.00గం. EEపేరు మరియు చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, GHMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, GHMC.
DIPR.No.10399-PP/CL/Advt/1/2023-24 తేదీ: 13.02.2024

## ఘనంగా సరోజినీనాయుడు జయంతి వేడుకలు



పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎన్వీఎస్ఎస్, కార్పొరేటర్లు చేతన, శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** స్వాతంత్రసమరయోధురాలు, దేశ మొదటి మహిళా గవర్నర్ సరోజినీనాయుడు జయంతి సందర్భంగా రామంతాపూర్‌లో పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, స్థానిక కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, బండారు శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో సరోజినీనాయుడు పాత్ర అమోఘం అన్నారు. దేశం కోసం ఆమె ఎన్నో త్యాగాలు చేశారని పేర్కొన్నారు. సరోజినీనాయుడిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి భోజనం చేశారు. వారికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సుధాకర్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల స్వాగతం



కాళేశ్వరం పర్యటనకు వెళుతున్న సిఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** కాళేశ్వరం పర్యటకు వెళుతున్న సిఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం ఉప్పల్‌లో కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డిఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఉప్పల్ కమాన్ వద్ద పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు సిఎం ప్రయాణిస్తున్న బస్సుకు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పార్టీ ఇంచార్జీ పరమేశ్వర్‌రెడ్డి మాట్లడుతూ కాళేశ్వరం మేడిగడ్డలో జరిగిన అవినీతిని వెలిసితీసేందుకు సిఎం రేవంత్‌రెడ్డి వెళుతున్నారని, బిఆర్ఎస్ పార్టీ అక్రమాలను బయటపెడుతారని ఆయన పేర్కొన్నారు. ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి బస్టాండ్ వరకు వివిధ ప్రాంతాల్లో పలువురు పార్టీ నేతలు సిఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధురానగర్‌లో కార్పొరేటర్ చేతన పర్యటన

**ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని మధురానగర్‌లో స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మధురానగర్‌లో కొత్తగా సిసి రోడ్డు పనులు చేపడుతున్నామని, పనుల విషయంలో నాణ్యత పాటించాలని సూచించారు. అదేవిధంగా శ్రీనివాసపురంలో యుజిడి డ్రైనేజీ లైన్లు వేయాలని, రోడ్లు వేసే సమయంలో కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించాలని కోరారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, ఒగిరాల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూళ్ళ సమస్యల పరిష్కారానికి ట్రస్మా కృషి



ఎన్నిక సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ట్రస్మా అధ్యక్షుడు లార్డ్స్ బీరప్ప

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి ట్రస్మా కృషి చేస్తుందని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సిద్దాల లార్డ్స్ బీరప్ప స్పష్టం చేశారు. ట్రస్మా ఆధ్వర్యంలో బీరప్ప సమక్షంలో గండిపేట్ మండల ట్రస్మా కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఎన్నికైన కోడూరు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శ్రవణ్, కోశాధికారిగా ఎన్నికైన కావ్యా పాల్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్మా కార్యవర్గాలు సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి సహకరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుల్షాని, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు రామంతాపూర్‌లో సరస్వతిమాత పూజ

**ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** రామంతాపూర్ సత్యనారాయణస్వామి దేవాలయం వద్ద బుధవారం సరస్వతి పూజా సమితి ఆధ్వర్యంలో సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి నేత మంజునాథగుప్త తెలిపారు. రామంతాపూర్‌లో గత 17 సంవత్సరాల నుంచి సరస్వతి పూజ, హోమం, సామూహిక అక్షరభ్యాసములు, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, వివరాలకు 9701643011, 9885085511 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## నల్లగొండ బిఆర్ఎస్ సభకు తరలిన శ్రేణులు



బిఆర్ఎస్ సభకు వెళ్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల తదితరులు

**నాచారం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** కృష్ణా ప్రాజెక్టులను కృష్ణానది యాజమాన్య బోర్డుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపుతో నాచారం, మల్లాపూర్ డివిజన్ల నుంచి ఎమ్మెల్యే బీఎల్ఆర్, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ శ్రేణులు నల్లగొండ సభకు ఆర్టీసీ బస్సుల్లో సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, తండా వాసుదేవ్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, మేకల ముత్యంరెడ్డి, కొరపాక అంజి, కట్టబుచ్చన్నగౌడ్‌తో పాటు పలువురు సభకు బయలు దేరి వెళ్లారు.

## ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : మాజీ మంత్రి మహమూద్ అలీ



బహిరంగ సభకు తరలివెళుతున్న మహమూద్ అలీ తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తుందని మాజీ హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. నల్గొండలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలతో కలిసి అజంపుర బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాజలాల పరిరక్షణ, కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి లాయఖ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## జనాభా అవసరాలకు అనుగుణంగా సదుపాయాల కల్పన : ఛైర్‌పర్సన్ స్వప్న



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న

**హయత్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** నూతనంగా ఏర్పాటైన కాలనీలకు అవసరమైన మేర నిధులను కేటాయించి దశలవారిగా సమస్యలను పరిష్కరిస్తున్నామని పెద్దఅంబర్‌పేట ఛైర్‌పర్సన్ చెవులస్వప్న అన్నారు. మున్సిపాలిటీ పరిధి పసుమాముల గ్రామంలోని మంజీరా కాలనీలో 20 లక్షల రూపాయలతో చేపట్టిన డ్రైనేజీ పనులు, శ్రీరాంనగర్‌లో 5 లక్షల రూపాయలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు ఆమె మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ క్రమంలో సమస్యలు తీవ్రంగా ఉన్నచోట ముందుగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ అశోక్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు శంకరయ్యగౌడ్, నాయకులు చిరంజీవి, కాలనీ ప్రతినిధులు ప్రతాప్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, మాధవచారి, శేఖర్‌చారి, మాధవరెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

## కెసిఆర్ సభకు తరలిన బిఆర్ఎస్ నాయకులు



బస్సుల్లో తరలివెళ్తున్న కార్పొరేటర్లు, నాయకులు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** తెలంగాణలో కృష్ణానదిపై నిర్మించిన ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు అప్పగించడానికి జరుగుతున్న ప్రయత్నాలను నిరసిస్తూ మంగళవారం బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో నల్గొండలో తలపెట్టిన భారీ బహిరంగ సభకు మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు మీర్‌పేట్ కార్పొరేషన్ నుండి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు నల్గొండకు తరలివెళ్ళాయి. పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, బైగళ్ళ బాలమణి, కొంద్రు గౌరీ శంకర్, కో-ఆప్షన్ సభ్యుడు రవినాయక్, నాయకులు దీప్‌లాల్‌చౌహాన్, దిండు భూపేష్‌గౌడ్, శ్రీనివాస్ నాయక్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వంటేరు నర్సింహారెడ్డి, లంకాల రమేష్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ నుండి బిఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో నల్గొండలో కెసిఆర్ సభకు పెద్దబావి ఆనంద్‌రెడ్డి, సంరెడ్డి వెంకట్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, పెద్దబావి మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, పెద్దబావి మహేందర్‌రెడ్డి తదితరులు బస్సుల్లో నల్గొండకు తరలివెళ్ళారు.

## అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి: కార్పొరేటర్ చారి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం గృహ జ్యోతి పథకం కింద లబ్ధి చేకూర్చాలని 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి డిమాండ్ చేశారు. డివిజన్‌లోని సిర్లాహిల్స్‌లో మంగళవారం ఆయన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం అధికారులు ఏర్పాటు చేసిన కౌంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం అర్హులను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తుదారులు తమ దరఖాస్తు రిసిప్ట్‌ను, ఎలక్ట్రిసిటీ బిల్‌ను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రుద్ర వెంకటేష్, భాస్కరచారి, రాజు, ఆంజనేయులు, సత్యనారాయణ, హరి, అరవింద్, సురేష్ పాల్గొన్నారు.

## పేదల పక్షాన సీపీఐ నిరంతర పోరాటం

**హయత్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** పేదల పక్షాన సీపీఐ నిరంతరం పోరాడుతోందని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి కుంట్లూర్ గ్రామం రావినారాయణరెడ్డి కాలనీలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. పార్టీ విధానాలకు ఆకర్షితులై ఎంతో మంది పార్టీ సభ్యత్వాలను తీసుకుంటున్నారని తెలిపారు. పేద, మధ్యతరగతి సంక్షేమం కోసం సీపీఐ కొనసాగిస్తున్న పోరాటంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర హరిసింగ్‌నాయక్, నాయకులు బిక్షంనాయక్, వినోద్‌నాయక్, లాలప్ప పాల్గొన్నారు.

## బఫర్ జోన్‌లో నిర్మించిన ఇళ్ళపై విచారణ చేయాలని కలెక్టర్‌కు వినతి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ పెద్ద చెరువు కట్ట దిగువన 28వ డివిజన్ కిందకు వచ్చే ప్రాంతంలో ఇరిగేషన్ బఫర్ జోన్, కాలనీ రోడ్లు అక్రమించి జరిగిన ఇళ్ళ నిర్మాణాలపై సమీక్ష జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. డివిజన్ కాలనీలకు చెందిన ఎ.హనుమంతరావు, యాదవ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్యామ్ కుమార్, బలరామకృష్ణ, సుబ్రమణ్యంలతో పాటు పలువురు సంతకాలు చేసిన ఫిర్యాదును కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. డివిజన్‌లోని టిఎస్ఆర్‌నగర్, న్యూ బాలాజీనగర్ ఎక్స్‌టెన్షన్‌లలో ఇరిగేషన్ బఫర్ భూమి, చెరువు కట్ట భూమి, కాలనీ రోడ్డును అక్రమించి గతంలో ఇళ్ళ నిర్మాణాలు జరిగాయనీ ఈ మేరకు సర్వే చేసి సదరు భూమిలో ఉన్న కృష్ణా పైపులను కాపాడాలని వారు కోరారు. అదే విధంగా అక్రమ ఇళ్ళ నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్ రూ.82.78 కోట్లకు పాలకవర్గ ఆమోదం



బడ్జెట్ సమావేశంలో ప్రసంగిస్తున్న బడంగ్‌పేట్ మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.82.78 కోట్ల బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపింది. దావూద్‌ఖాన్‌గూడలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ నూతన భవనంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన కమీషనర్ బడుగు సుమన్ రావు ఆధ్వర్యంలో వార్షిక బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎజెండా ప్రకారం అంశాల వారీగా చర్చించారు. అనంతరం బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.82.78 కోట్ల అంచనాతో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌కు పాలకవర్గ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

**ఎస్ఎన్‌డిపి పనుల పూర్తికి చర్యలు: మేయర్ పారిజాత..** బడ్జెట్ సమావేశం సందర్భంగా మేయర్ పారిజాత మాట్లాడుతూ కార్పొరేషన్‌లో అసంపూర్తిగా ఉన్న ఎస్ఎన్‌డిపి పనులను వచ్చే వర్షాకాలంలోపు పూర్తి చేస్తామని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో నూతనంగా కాలనీలు ఏర్పడి జనాభా పెరుగుతున్నందున డ్రైనేజీ, రోడ్లు, తాగు నీరు, స్ట్రీట్ లైట్స్ తదితర కనీస వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యతనిచ్చామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి ఫ్లోర్ లీడర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సూర్లగంటి అర్జున్, తోట శ్రీధర్‌రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, డిఇ జ్యోతిరెడ్డి, ఎఇ బిక్కు నాయక్, వినీల్‌గౌడ్, రెవెన్యూ ఆఫీసర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ వనజ, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వి.యాదగిరి, కార్యాలయ మేనేజర్ నగేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్ చెరువును పరిశీలించిన జిహెచ్‌ఎంసి కమీషనర్ రోనాల్డ్ రాస్



సరూర్‌నగర్ చెరువును పరిశీలిస్తున్న జిహెచ్‌ఎంసి కమీషనర్ రోనాల్డ్‌రాస్

**సైదాబాద్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ చెరువును రెండు జోన్ల పరిధిలో కాకుండా ఎల్‌బినగర్ సర్కిల్ పరిధిలో ఉండే విధంగా ఆదేశాలు జారీ చేయాలని జిహెచ్‌ఎంసి కమీషనర్ రోనాల్డ్‌రాస్‌ను లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కోరారు. వివిధ శాఖల అధికారులతో కలసి జిహెచ్‌ఎంసి కమీషనర్ రోనాల్డ్‌రాస్ మంగళవారం సరూర్‌నగర్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ తపోవన్ కాలనీని మ్యాన్యుఫ్యాక్చర్ జోన్ నుంచి తొలగిస్తున్నట్లు కోర్టు ఉత్తర్వులు ఉంటే వాటిని పరిశీలించి రిజిస్ట్రేషన్స్ చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్‌బినగర్ నియోజకవర్గంలోని సమస్యలతోపాటు సరూర్‌నగర్ చెరువు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి కృషి : కార్పొరేటర్ బద్దం



సమస్యలు తెలుసుకుంటున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** నేతాజీనగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. నేతాజీనగర్‌కాలనీలో మంగళవారం పర్యటించిన కార్పొరేటర్ దృష్టికి కాలనీవాసులు భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్ సదుపాయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో సమీక్షించి వీలైనంత త్వరగా నిర్మాణం చేపడతామని అన్నారు. కాలనీలో చెత్తాచెదారం వెంటనే తొలగించేందుకు శానిటేషన్ సిబ్బందిని పిలిచి కాలనీ పరిసరాలు పరిశుభ్రం చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులో మూర్తియాదవ్, చందర్, ప్రభాకర్, నర్సింగ్‌రావు, ప్రసాద్, శ్రీధర్, బీజేపీ డివిజన్ ప్రధానకార్యదర్శి ఏనుగు శ్రీధర్‌రెడ్డి, సంతోష్‌నాయక్, రఘునందన్ జోషి, టీంకు తదితరులు పాల్గొన్నారు.

## దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయంలో నేడు వసంత పంచమి వేడుకలు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీషిరిడి సాయిబాబా దేవాలయం ఆధ్వర్యంలో బుధవారం శ్రీ సరస్వతీ మాత జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ వసంత పంచమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయం చైర్మన్ గుండ మల్లయ్యగుప్త తెలిపారు. వసంత పంచమి సందర్భంగా సాయిబాబా సన్నిధిలో శ్రీ సరస్వతీ మాత పూజా కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో బాలబాలికలు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి : నరసింహగుప్తా



కాలనీవాసులతో మాట్లాడుతున్న రంగ నరసింహ గుప్తా

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** కాలనీలలో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నరసింహగుప్తా పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్‌లోని మారుతినగర్ కాలనీలో కొత్త యుజిడి డ్రయన్‌లైన్స్, వాటర్‌లైన్స్, కొత్త రోడ్స్ అవసరం వున్న దృష్ట్యా కాలనీ వారితో కలిసి కార్పొరేటర్ మంగళవారం జిహెచ్‌ఎంసి అధికారులను పిలిపించి పలు సమస్యలపై చర్చించారు. కాలనీ వాసులు, అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి నూతన పనులకు సంబంధించి అంచనాలు చేసి, నిధులను కేటాయించి పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రోహన్‌రెడ్డి, పార్వతి, రత్నసాయి, సురేందర్, శ్రీకాంత్, శ్రీరాములు, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌కృష్ణ, ఉపేందర్, ఉలిపే శివ, అంజిబాబు పాల్గొన్నారు.

## బహిరంగసభకు తరలిన బిఆర్ఎస్ నేతలు



జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** కృష్ణా నది జలాలపై తెలంగాణ హక్కుల పరిరక్షణకోసం నల్లగొండ జిల్లాలో జరిగిన బహిరంగ సభకు ఉప్పల్ నియోజకవర్గం నుంచి పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. ర్యాలీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కృష్ణా నది జలాల విషయంలో కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, కృష్ణా జలాలపై బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు హజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, దేవేందర్‌రెడ్డి, నేతలు బన్నాల ప్రవీణ్, గంధం నాగేశ్వర్‌రావు, సాయిజెన్ శేఖర్, జి.శ్రీనివాస్‌రెడ్డి పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## మన నీళ్ళు మనకే కావాలి : అరవింద్‌శర్మ
### నల్గొండ సభకు తరలిన ఆర్కేపురం గులాబీ దండు



నల్గొండ సభకు వెళ్తున్న అరవింద్‌శర్మ, సునీతరెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** మననీళ్లు మన ప్రాజెక్టులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేతిలోనే ఉండాలని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీప్రధానకార్యదర్శి అరవింద్‌శర్మ పేర్కొన్నారు. మంగళవారం చలో నల్గొండ సభకు ఆర్కేపురం డివిజన్ నుండి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల హక్కుల కోసం జంగు సైరన్ నల్గొండ నుంచి మొదలు పెట్టామన్నారు. నీటి హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద మోకరిల్లిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్తారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కృష్ణ నదిపై ఒక్క ప్రాజెక్టు కట్టేందుకు 40 ఏళ్ల పట్టిందన్నారు. కేఆర్ఎంబి అప్పు చెప్పడం అంటే తెలంగాణ నీటిని కోల్పోవడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహమ్మద్ జాహిద్, మంత్రి రవీందర్రావు, వెంకటేష్‌గౌడ్, శ్రీరాములు, పెంబర్తి శ్రీనివాస్, బాలుశ్రీ, అనురాధ, మాధవి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

## అయోధ్య నుంచి నగరానికి బయలుదేరిన బిజెపి నాయకులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** అయోధ్యలోని బాలరాముడి దర్శనానికి తరలి వెళ్లిన కొత్తపేట డివిజన్ బిజెపి నాయకులు మంగళవారం నగరానికి తిరుగు ప్రయాణం చేశారు. బలరాముడి దర్శనం కోసం బిజెపి నాయకులు పెద్దఎత్తున అయోధ్యకు తరలి వెళ్లారు. బాలరాముడు దర్శనం అనంతరం బిజెపి శ్రేణులు నగరానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో వజీర్ కుమార్‌గౌడ్, దాసరి జయప్రకాష్, నీరంకి రవి, సంగ్రామ్, మంచి రాజేష్, శివనేత, సత్య చరణ్, శ్రీను, బాలు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను పూర్తి చేయాలి : అబ్రార్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అబ్రార్ తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని అజంపుర డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్‌లోని ఫరత్‌నగర్‌లో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధిపనుల్లో నాణ్యత పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని పూర్తి చేయాలని సూచించారు. అభివృద్దే ధ్యేయంగా పని చేస్తూ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ మల్లికార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్, నాయకులు ఖైసర్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల కంటి సమస్యలకు ఏ విటమిన్ దోహదపడుతుంది: డాక్టర్ వెంకటేశ్వర్లు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** పిల్లల కంటి సమస్యలను నివారణకు ఏ విటమిన్ ఎంతగానో దోహద పడుతుందని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సరూర్‌నగర్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ అంగన్వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన విటమిన్ ఏ ద్రావణం పంపిణీని అయన ప్రారంభించారు. మొదటి రోజు తొమ్మిది నెలల నుంచి ఐదు సంవత్సరముల పిల్లలకు విటమిన్ ఏ ద్రావణం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు సంభవించే రేచీకటి ఇతర కంటి జబ్బులను నివారించడానికే అన్నారు. ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో, అంగన్వాడీ కేంద్రాలలో ద్రావణం పంపిణీ ఉంటుందని తెలిపారు. విటమిన్ ఏ ద్రావణమును పిల్లలకు తప్పనిసరిగా ఇప్పించాని అయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణలత, డిప్యూటీ డిఎం, హెచ్ఓ డాక్టర్ వినోద్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అర్చన సిబ్బంది పాల్గొన్నారు.



అష్టలక్ష్మి దేవాలయంలో సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం సమతా దీక్ష కార్యక్రమంలో పాల్గొన్న అహోబల రామానుజ జీయర్ స్వామి భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ స్వామీజీని ఘనంగా సత్కరించారు. (ప్రభాతవార్త, ఎల్.బి.నగర్)